క్లుప్తంగా

ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



నవీపేట: విద్యుత్ వినియోగదారుల సమస్యల ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తీసుంటామని ఎన్పీడీసీఎల్ సీజీఆర్ఎఫ్–2 చైర్మన్ ఎరుకల నారాయణ హెచ్చరించారు. మండలంలోని జన్నెపల్లి సబ్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల సదస్సులో ఆయన మాట్లాడారు. వినియోగదారుల సమస్యలపై స్పందిస్తేనే మంచి గుర్తింపు వస్తుందని, బిల్లులను సకాలంలో చెల్లిస్తారని పేర్కొన్నారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాల లైన్లు దెబ్బతిన్నాయని, మళ్లీ రబీ సీజన్‌కు ముందే వాటిని సరి చేయాలని సూచించారు. వరి కోతల ఆరంభ సమయంలో లూస్ లైన్‌లను సరి చేయాలని, హార్వెస్టర్ మిషన్‌లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. విద్యుత్ సదస్సుపై ప్రచారం చేయకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రామకృష్ణ, కిషన్, డీఈఈ శ్రీనివాస్, ఏడీఈ ప్రశాంత్ రెడ్డి, ఏఈశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి మధ్యాహ్న భోజనం నిలిపివేత



మాక్లూర్ : పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులు ఈనెల 10వ తేదీ వరకు చెల్లించకపోతే 13వ తేదీ నుంచి పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటకాలు నిలిపివేస్తామని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశానికి చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు సాయమ్మ, లక్ష్మి, ప్రమీల, విజయ అన్ని పాఠశాలల మధ్యాహ్నం భోజన కార్మికులు పాల్గొన్నారు.

మక్క కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



మోర్తాడ్: మక్కల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరుతూ బుధవారం ఏర్గట్ల తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. దళారులు ప్రతి క్వింటాలుకు రూ.400ల నుంచి రూ.500ల వరకూ ధర తగ్గించి రైతులను నష్టపరుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఏలేటి నారాయణరెడ్డి, భూమేష్, రమేష్, మహిపాల్ రెడ్డి, రామరాజు, లింగరెడ్డి, వంశీ, రిషీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పిప్రిరోడ్డులో గల ఆర్మూర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థి ఉమేష్ చంద్ర ఉమ్మడి నిజామాబాద్ జిల్లా తరపున ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సాయన్న బుధవారం తెలిపారు. ఈ నెల 10 నుంచి 12 వరకు మహబూబాబాద్‌లో జరిగే అండర్ –19 ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థి ఉమేష్‌చంద్రను వైస్ ప్రిన్సిపల్ చక్రపాణి దయాల్, వ్యాయామ ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్, రాజేందర్, నరేష్, పాఠశాల, కళాశాల బృందం అభినందించారు.

చదువుకుంటేనే మంచి భవిష్యత్తు



బోధన్‌టౌన్(బోధన్): చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని మధుమాలాంచ పాఠశాల పూర్వ విద్యార్థి వి.వి.ఎస్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ మధుమాంఛ పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలకు రూ. 1.25 లక్షలు వచ్చించి ఫర్నీచర్‌ను విరాళంగా అందించారు. పాఠశాల హెచ్ఎం నరేందర్, టీచర్లు సుమన, లావణ్య, స్వప్న, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూపు

- పట్టించుకోని బల్దియా అధికారులు

బోధన్‌టౌన్(బోధన్): గత ప్రభుత్వ హయాంలో బల్దియా పరిధిలో పట్టణ ప్రగతి కింద అభివృద్ధి పనులు చేపట్టారు. శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనులు, డ్రెయినేజీ, రోడ్ల నిర్మాణాలను వార్డుల్లో కాంట్రాక్టర్‌లు చేపట్టారు. పట్టణ ప్రగతితో పాటు, 15వ ఆర్థిక సంఘం, స్పెషల్ గ్రాంట్స్ ద్వారా వివిధ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బల్దియా రూ. 6 నుంచి 7 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. దీంతో అధికారులు పట్టించుకోవడం లేదని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.దీంతో బిల్లులు చెల్లించాలని బల్దియా కాంట్రాక్టర్‌లు పలు మార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్‌కు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో కొన్ని నెలల పాటు బల్దియా పనులు నిర్వహించ లేదు.



కోర్టుకు ఎక్కిన కాంట్రాక్టర్

పట్టణంలో సమీకృత విజిటెబుల్ మార్కెట్ నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌కు మూడేళ్లుగా బిల్లులు మంజూరు కాలేదు. అధికారుల చుట్టూ తిరిగినా బిల్లులు మంజూరు కాకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించక పోతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో తనకు రావాల్సిన రూ. 3 కోట్ల బిల్లులు చెల్లించాలని సదరు కాంట్రాక్టర్ 45 రోజుల క్రితం హైకోర్టును ఆశ్రయించాడు. స్పందించిన హైకోర్టు 10 రోజుల్లో బిల్లులు చెల్లించాలని బల్దియాకు నోటీసులు జారీ చేసింది. దీంతో కమిషనర్ జాదవ్ కృష్ణ ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి బుధవారం కోర్టుకు హాజరయ్యారు. కోర్టుకు ఎక్కితేనే తాము చేసిన పనులకు బిల్లులు వస్తాయని భావిస్తున్న మరికొందరు కాంట్రాక్టర్‌లు తోటి కాంట్రాక్టర్‌ను ఫాలో అయ్యేందుకు సిద్ధం అవుతున్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

పెర్కిట్(ఆర్మూర్): స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారులు పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఎమ్మార్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం డివిజన్ స్థాయిలో ప్రిసైడింగ్, అసిస్టెంటు ప్రిసైడింగ్ అధికారులకు బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే ఎన్నికలు సజావుగా సాగాలన్నారు. ఎన్నికల్లో పాల్గొనే అధికారులు నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. జెడ్పీ డిప్యూటీ సీఈవో సాయన్న, డీఎల్పీవో శివకృష్ణ, ఆర్మూర్, భీంగల్, ఆలూర్, బాల్కొండ ఎంపీడీవోలు శివాజీ, సంతోష్ కుమార్, గంగాధర్, విజయ భాస్కర్ రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఎంఈవో రాజ గంగారాం, అశోక్, సంగెం అశోక్ తదితరులున్నారు.

డివిజన్ స్థాయి ఎన్నికల అధికారులకు శిక్షణ

బోధన్: పట్టణ కేంద్రంలోని లయన్స్ కంటి ఆస్పత్రి ఆడిటోరియం హాల్‌లో బుధవారం డివిజన్ స్థాయి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పీవోలు, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ పరిధిలోని బోధన్, సాలూర, ఎడపల్లి, రెంజల్, రుద్రూర్, పోతంగల్, వర్ని, మోస్రా, చందూర్ మండలాలకు చెందిన పీవోలు,ఏపీవోలు శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు, మాస్టర్ ట్రెయినర్స్ నరేందర్, బస్వంత్, ఆయా మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు. ఎన్నికల నిబంధనలు, పోలింగ్ ప్రక్రియ సజావుగా పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధులు, బాధ్యతలను వివరించారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా

‘అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారు’

ఆర్మూర్: ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో అబద్ధపు హామీలను గుప్పించి రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చారని అఖిల భారత రైతు ఐక్య సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వీ.ప్రభాకర్ ఆరోపించారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.రెండు లక్షల వ్యవసాయ రుణమాఫీ, క్వింటాలు వరికి రూ.500 బోనస్ ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో వైపు రాష్ట్రంలో 16 లక్షల ఎకరాలలో మొక్కజొన్న సాగు అవుతుండగా పంట చేతికి వచ్చి 20 రోజులకు పైగా గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లపై ఆరబోసుకున్న రైతులు వర్షం కారణంగా ఇక్కట్లు పడుతున్నారన్నారు. దీంతో మధ్య దళారులు ధరను తగ్గించి మొక్కజొన్నను కొనుగోలు చేస్తున్నారన్నారు. కులాల్లో ఏ,బీ,సీ,డీలు పెట్టినట్లుగానే ధాన్యంలో కూడా ఏ,బీ,సీ,డీలు పెట్టే పద్ధతి సీఎం రేవంత్ రెడ్డికే చెల్లుతుందని ఎద్దేవా చేశారు.ఈ సమావేశంలో ఏఐయూకేఎస్ రాష్ట్ర నాయకుడు దేవరాం, జిల్లా అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి కిషన్, డివిజన్ నాయకులు యా.రాజన్న, ఆకుల గంగారాం, జక్కం శేఖర్, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.కిషన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్

ఓటు చోరీపై సంతకాల సేకరణ



వర్ని (మోస్రా): కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఓటు చోరీపై మోస్రా మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మోస్రా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు పిట్ల శ్రీరాములు, హరి నారాయణ, నర్సారెడ్డి, ఇంతియాజ్, సతీష్ రెడ్డి , చింటూ పాల్గొన్నారు.

కల్లెడిలో ఐమాస్ట్ లైట్ ప్రారంభం



మాక్లూర్: మండలంలోని కల్లెడి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐమాస్ట్ లైట్‌ను బుధవారం బీజేపీ నాయకుడు గంగోల్ల ప్రణయ్‌తేజ్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ మంజూరు చేసిన రూ.లక్ష 30 వేల నిధులతో ఐమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించుకున్నామని ప్రణయ్‌తేజ్ తెలిపారు. బీజేపీ బూత్ అధ్యక్షుడు మచ్చర్ల అర్జిత్, బండారి మధు, అరుణ్, మండల ఉపాధ్యక్షురాలు మోతె శ్రావణ్య, శక్తి కేంద్రం ఇన్‌చార్జి బి.నగేష్, బాషెట్టి గంగాధర్, సిరికొండ సాయికుమార్, దినేష్, సాయిచరణ్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం కాంగ్రెస్ బాకీ కార్డులను దుకాణాల్లో ప్రజలకు పంపిణీ చేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ నర్మెనవీన్, బీఆర్ఎస్ నాయకులు సుంకరి వరి, గంగాధర్, పృథ్వీ, అగ్గు క్రాంతి, రంజిత్, మీరా శ్రావణ్, లతీఫ్, అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 20 వేల ఆర్థిక సహాయం

బోధన్‌టౌన్(బోధన్): చికిత్స చేయించడానికి ఆర్థిక సహాయం కోరిన కుమార్ యాదవ్‌కు మేముసైతం ఫౌండేషన్ నిజామాబాద్ స్వచ్ఛంద సంస్థ చేయూత అందించింది. స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన కుమార్ యాదవ్ కూతురు నిహాన్షిక ప్రమాద వశాత్తు వేడి నీటిలో పడి, ప్రాణాపాయ స్థితిలో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. చికిత్స కోసం అతను ఆర్థిక సహాయం కోరారు. కుమార్ యాదవ్‌కు మేముసైతం ఫౌండేషన్ తరపున బుధవారం రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందించినట్లు సంస్థ ఫౌండర్ గైని నవీన్‌కుమార్ తెలిపారు.

వర్షం బాధితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలి

- ఆర్మూర్ సబ్ కలెక్టర్ కార్యాలయానికి తరలి వచ్చిన మోర్తాడ్ గ్రామస్తులు

ఆర్మూర్: మోర్తాడ్ మండల కేంద్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఇళ్లు, గుడిసెలు కూలిపోవడంతో నిర్మాణం పూర్తయి ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లలో తలదాచుకొని పునరావాసం కల్పించుకున్న 40 మంది బాధితుల్లో అర్హులైన వారికి ఆ ఇళ్లు కేటాయించాలని నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా కమిటీ కార్యదర్శి వీ.ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీగా తరలి వచ్చిన బాధితులు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మోర్తాడ్‌లో 224 డబుల్ బెడ్ రూం ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్మించగా 150 ఇళ్లను పంపిణీ చేశారన్నారు. మిగిలిన 70 ఇళ్లలో ఇళ్లు లేని 40 నిరుపేద కుటుంబాలు తల దాచుకున్నాయన్నారు. మోర్తాడ్ తహసీల్దార్ వీరిని ఖాళీ చేయాల్సిందిగా పోలీసుల ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. బాధితులకు పునరావాసం కల్పించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం వీరిలో అర్హులైన వారికే ఆయా ఇళ్లు కేటాయించాలన్నారు. బాధితుల దీన స్థితిని పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నాలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు సురేష్, మోర్తాడ్ సంయుక్త మండల కార్యదర్శి ఏ.కిషన్, టీయూసీఐ నాయకురాలు సత్తక్క, ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆకుల గంగారాం, బీ.కిషన్, జక్కం శేఖర్, సాయన్న, పద్మ, అంజలి తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ప్రజాపంథా నాయకులు

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



రుద్రూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ తారాబాయి

నందిపేట్/రుద్రూర్/బోధన్/ మాక్లూర్ : రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అయిలాపూర్ సొసైటీ చైర్మన్ మీసాల సుదర్శన్, మండల తహసీల్దార్ సంతోష్ పేర్కొన్నారు. బుధవారం నందిపేట మండలంలో వెల్మల్, నందిపేట, అయిలాపూర్ గ్రామంలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. రుద్రూర్ మండలం సిద్దాపూర్, అంబం (ఆర్) గ్రామాల్లో, మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ తారాబాయి ప్రారంభించారు. ఎడపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ దత్తాద్రి, ఐకేపీ ఉద్యోగులు, స్థానిక రైతులతో కలిసి ప్రారంభించారు.మాక్లూర్ మండలం అమ్రాద్ సొసైటీ ప్రాంగణంలో సొసైటీ కార్యదర్శి గుండేటి గంగారాం అధ్యక్షతన చైర్మన్ ఎనుగంటి శ్రీనివాస్ గౌడ్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.



నందిపేటలో .. ప్రారంభిస్తున్న అయిలాపూర్ సొసైటీ చైర్మన్ మీసాల సుదర్శన్



ఎడపల్లిలో.. ప్రారంభిస్తున్న తహసీల్దార్ దత్తాద్రి, ఐకేపీ ఉద్యోగులు



అమ్రాద్‌లో.. ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ ఎనుగంటి శ్రీనివాస్ గౌడ్

ఇజ్రాయిలీలు భారతీయులకు ఆత్మీయులు



సంతాపం తెలుపుతున్న ఇజ్రాయిల్ తెలంగాణ అసోసియేషన్ ప్రతినిధులు

ఆర్మూర్: ఇజ్రాయిలీలు భారతీయులకు ఆత్మీయులని ఇజ్రాయిల్ తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు బాణాల గంగాధర్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ దేశీయుల సహకారంతో తెలంగాణ ప్రాంతానికి చెందిన సుమారు ఐదు వేల మంది అక్కడ ఉపాధి కల్పించుకున్నామన్నారు. 2023 అక్టోబర్ 7న హమాస్ తీవ్రవాదుల దాడిలో మరణించిన 1,200 మంది ఇజ్రాయిల్ ప్రజలకు ఇజ్రాయిల్‌లోని రమాత్‌గాన్ పట్టణంలో తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడు తూ బందీలుగా ఉన్న ఇజ్రాయిలీలను హమాస్ తీవ్రవాదులు విడుదల చేసేలా దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. తెలంగాణ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మంగళారం రాజు, ప్రధాన కార్యదర్శి చిన్న, కోశాధికారి శ్రీనివాస్‌గౌడ్, మాజీ చైర్మన్ దేగాం లక్ష్మీనారాయణ,అసోసియేషన్ వ్యవస్థాపకులు మెరుగు మహేష్, మచ్చర్ల ఉషన్న, యాదగిరి, అన్వేష్, నారాయణ, సాల్మన్, విజయ్ తదితరులున్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఆర్మూర్: ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. మక్కలను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలన్నారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న ఎంఎస్‌పీ క్వింటాలుకు రూ.2,400 ఉండగా దళారులు వాతావరణ పరిస్థితులను సాకుగా చూపిస్తూ కేవలం రూ.1,800లకే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని వాపోయారు. రబీలో పండించిన వరి పంటకు రూ.500 బోనస్ వెంటనే రైతుల ఖాతాల్లో వేయాలన్నారు. రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన అమలు చేయాలంటూ, రైతులకు ఇచ్చిన హామీలన్నిటిని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు వినతి పత్రాన్ని అందజేశారు. కిసాన్ మోర్చా నాయకులు చిటి భాజన్న, పోశెట్టి, మల్లయ్య, శ్రీనివాస్, సంతోష్, కలిగోట ప్రశాంత్, రైతులు ఉన్నారు.



సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు

వైద్యుల కొరత

- ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో అందని అత్యవసర సేవలు
- మత్తు వైద్యుడు లేకపోవడంతో గర్భిణులకు ఇబ్బందులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో వైద్య సిబ్బంది కొరత వేధిస్తోంది. ఆస్పత్రిలో 46 మంది వైద్యులు ఉండాల్సిన చోట కేవలం 11 మంది మాత్రమే సేవలు అందిస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకే ప్రసూతి సేవలు అందిస్తున్నారు. అత్యవసర ప్రసూతి సేవలు అందడం లేదు. ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగి తీవ్ర గాయలైతే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాల్సిన పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టు పై పనిచేస్తున్న ఇద్దరు మత్తు వైద్యులు ఇటీవల రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఉన్న ఒక మత్తు వైద్యుడు సైతం సెలవుల్లో ఉండటంతో వైద్య సేవల్లో అంతరాయం కలుగుతుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ చెబుతున్నారు.

పేరుకే 100 పడకల ఆస్పత్రి, సేవలు అరకొర..

పేరుకు 100 పడకల ఆస్పత్రిగా ఉన్నా, వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. ప్రస్తుతం ఆర్మూర్‌లో సేవలు అందిస్తున్న 11 మంది వైద్యులు సైతం భీంగల్ ఆస్పత్రి నుంచి డిప్యూటేషన్‌పై వచ్చినవారే. భవనం నిర్మాణంలో ఉండటంతో అక్కడి నుంచి నుంచి డిప్యూటేషన్‌పై వైద్యులు ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు.



సౌకర్యాల్లో లోపాలు ఇవి..

- ఆస్పత్రిలో స్కానింగ్ సదుపాయం లేదు.
- గర్భిణులు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి.
- మత్తు వైద్యుడు సెలవులో ఉంటే ప్రసూతి ఆపరేషన్లు నిలిచి పోతున్నాయి.

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సిందే..



ఏరియా ఆస్పత్రిలో అత్యవసర ప్రసూతికి ఇకపై జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తుంది. డెలివరీకి వచ్చే గర్భిణులు ఒకరోజు ముందు వచ్చి తమ పేరు ఆస్పత్రిలో నమోదు చేసుకోవాలి. మత్తు వైద్యులు రాగానే అత్యవసర ప్రసూతి సేవలు అందిస్తాం.

– ప్రమీదరెడ్డి, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి

దివ్యాంగులను ప్రోత్సహించాలి

- ఆర్మూర్ భవిత కేంద్రాన్ని తనిఖీ చేసిన సహిత విద్యా విభాగం జిల్లా కో ఆర్డినేటర్
- రికార్డులతోపాటు కేంద్రం మరమ్మతుల పనుల పరిశీలన

ఆర్మూర్: వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులను చూసి జాలి పడకుండా వారిని ప్రోత్సహించాలని సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం జిల్లా కోఆర్డినేటర్ పడకంటి శ్రీనివాస్‌రావు సూచించారు. పట్టణంలోని భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించి ఐఈఆర్పీలు కిషన్, సురేష్‌తో మాట్లాడారు. కేంద్రంలో దివ్యాంగులకు అందిస్తున్న సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డితో కలిసి భవిత కేంద్రానికి మంజూరైన నిధులతో చేపడుతున్న మరమ్మతుల పనులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాల్సిందిగా కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలేఖ్య, ఆపరేటర్ రఘు, మెసెంజర్ రవి, సీజీవీ కవిత ఉన్నారు.



భవిత కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ పడకంటి శ్రీనివాస్‌రావు

విద్యార్థి సంఘాల జేఏసీ డివిజన్ నూతన కమిటీ ఎన్నిక

బోధన్: వామపక్ష విద్యార్థి సంఘాల జేఏసీ బోధన్ డివిజన్ నూతన కమిటీని మంగళవారం పట్టణ కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బుధవారం నాయకులు తెలిపారు.. ఏఐఎస్‌బీ (ఆలిండియా స్టూడెంట్ బ్లాక్)జిల్లా అధ్యక్షుడు డివిజన్ నూతన కమిటీకి చైర్మన్‌గా, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఆర్.గౌతం కుమార్ కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. కో–కన్వీనర్లుగా సంజయ్ తలారే, మౌనిక, ప్రశాంత్, ప్రచార కార్యదర్శిగా ఎండీ మోసిన్, కమిటీ సభ్యులుగా వివిధ విద్యార్థి సంఘాలకు చెందిన నాయకులు నజీర్, వినోద్,శ్రీకాంత్, సంతోష్, బాలరాజు, ప్రతాప్, రాజు, రాజేందర్, కిరణ్, సతీష్,జీవన్,మోహన్, రాజన్న, సాయినాథ్, మంగేష్, నాగేంద్ర లను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలనే లక్ష్యంతో డివిజన్ నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నట్లు వారు తెలిపారు.



డి.నాగరాజు



గౌతం కుమార్